వరదల నియంత్రణలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలం

రాజేశ్‌గౌడ్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 3 : వరద నష్టాన్ని నివారించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇందుకు నిదర్శనం వర్షప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడానికి వెళ్లిన సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రికి, మంత్రులకు ప్రజల నుంచి ఎదురవుతున్న నిరసన సెగలేనని అన్నారు. ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ నూటికినూరుశాతం విఫలమయ్యారని, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం..పరిస్థితిని అంచన వేయకపోవడంతో ప్రాణ నష్టంతో పాటు పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగి ఊర్లకు ఊర్లే కొట్టుకుపోయి వేలాది మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ఒక డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులు ఉన్న ఖమ్మం పరిస్థితి నేడు వర్ణనాతీతమని తెలిపారు. భారీ వర్షాలు పడినా బీఆర్ఎస్ పార్టీ పదేళ్లపాలనలో ఇలాంటి దుస్థితి తలెత్తలేదని, బీఆర్ఎస్ అధినేత తన చాకచక్యంతో ఒక్క ప్రాణాన్ని కూడా పోనివ్వలేదని తెలిపారు.

మాజీ మంత్రులపై దాడి హేయమైన చర్య

తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: అకాల వర్షాల కారణంగా ముంపునకు గురైన గ్రామాలను పరిశీలించేందుకు వెళ్లిన మాజీ మంత్రులపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు మండిపడ్డారు. స్వయంగా బయల్దేరిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిల వాహనాలపై కాంగ్రెస్ గూండాల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ముందు చూపులేని కారణంగా ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన వసతులు కల్పించకుండా వరద బాధితుల మృతికి కారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపునకు గురై చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను రక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ప్రభుత్వ అసమర్థత ఎక్కడ బయటపడుతుందోననే భయంతో ప్రభుత్వమే కాంగ్రెస్ కార్యకర్తలతో మాజీ మంత్రులపై దాడి చేయించిందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ దాడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రజలకు సాయం చేయడం చేతగాక, సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేకే ఈ దాడికి తెగబడ్డారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దాడికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తగిన మూల్యం చెల్లించకతప్పదని అన్నారు.

కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తా

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 3 : డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని జీవైఆర్ కాలనీ వాసులు ఆయనను కలిసి స్థానిక సమస్యలను ఆయనకు వివరించారు. మరికొందరు అర్హులకు ఇండ్లు రాలేదని ఆయనకు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని వారికి మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎం.వెంకట్‌బాబు, బాల్‌రాజ్, జహంగిర్, దశరథ్, రాజు, నర్సింహ, వినోద్, ప్రశాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన జీవైఆర్ కాలనీ వాసులు

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 3: రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ లోని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులతో కలిసి ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్ఖానా ప్రధాన రహదారిలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పై ఉన్న మూతలను నిమజ్జనం వరకు మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్ఖానా ప్రధాన రహదారిలోని డ్రైనేజీ పైప్‌లైన్‌పై ఉన్న మూతలను పరిశీలిస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ

సీఎం సహాయ నిధి అందజేత

సీఎం సహాయ నిధి ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న తీగుళ్ల రామేశ్వరగౌడ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 3 : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ముఖ్యమంత్రి సహాయనిధిని సమకూర్చారు. సికింద్రాబాద్‌లోని వారాసిగూడ ప్రాంతానికి చెందిన అంజూమ్ సదా అనే మహిళా తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో వెంటనే స్పందించిన పద్మారావుగౌడ్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించిరూ. 3 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని సమకూర్చారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ పత్రాన్ని రోగి కుటుంబ సభ్యులకు పార్టీ యువ నేత తీగుళ్లరామేశ్వరగౌడ్, సమన్వయ కర్త రాజా సుందర్ అందించారు.

పమాదాల నివారణపై అవగాహన

బొల్లారం, సెప్టెంబర్ 3: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. హైదరాబాద్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలనివారణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలనివారణపై అవగాహన కల్పిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఎడతెగని వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉండాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్ష సూచనల కారణంగా ఈ సమయంలో రోడ్లపై ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులతో తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఎంటమాలజీ విభాగం ఫాగింగ్‌ను మరింత వేగవంతంగా చేపట్టాలని అన్నారు. సేకరించిన చెత్తను జీవీపీ పాయింట్ల వద్ద నుంచి త్వరగా తరలించి, దోమలు, రోగాలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ తీగలు, వీధి దీపాలను చెట్లు కప్పేయకుండా రాత్రి వేళల్లోనూ వెలుగులు ఉండేలా చూడాలని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. డివిజన్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ వెంకటేశ్, ఇంజినీరింగ్ డివిజనల్ ఇంజినీర్ సువర్ణ, ఏఈ వేణు, ఎంటమాలజీ అధికారి రాజశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా శాఖ మంత్రిని వెంటనే నియమించాలి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 3: విద్యా శాఖ మంత్రిని ప్రభుత్వం వెంటనే నియమించాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు విద్యా రంగంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి దృష్టి పెట్టలేదని అన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రూ. 7,500 కోట్ల స్కాలర్ షిప్‌లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న గురుకుల సంక్షేమ హాస్టళ్లలలో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం సికింద్రాబాద్ పీజీ కళాశాల ఏబీవీపీ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడు తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంతో విఫలమైందని అన్నారు. 6 గ్యారెంటీలలో ఒక్కటైన విద్యా భరోసా కార్డును ఇప్పటి వరకు అమలు చేయలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తులసి, విష్ణోష్, ఉదయ్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

ఆర్థిక సాయం అందజేస్తున్న రామేశ్వర్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: వర్షాలతో ఇబ్బంది పడిన పేద కుటుంబాన్ని ఎమ్మెల్యే పద్మారావు తనయుడు రామేశ్వర్‌గౌడ్ ఆదుకున్నారు. తార్నాకలోని నాగార్జునన గర్ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఆకుల విష్ణు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ.. చిన్న రేకుల ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ఇల్లు పాక్షికంగా ధ్వంసం కావడంతో తనను ఆదుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పద్మారావులకు సమాచారం అందించారు. దీనికి వెంటనే స్పందించిన రామేశ్వర్‌గౌడ్ విష్ణు నివాసాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విష్ణు కుటుంబాన్ని ఆదుకుంటానని రామేశ్వర్ వారికి హామీ ఇచ్చారు. తన వంతుగా వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వైద్యులతో సమావేశమైన మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, సెప్టెంబర్ 3 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రబలుతున్న వ్యా ధుల దృష్ట్యా మంగళవారం మెట్టుగూడ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది, ఆశావర్కర్లతో కార్పొరేటర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నమోదవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల దృష్ట్యా బస్తీలపై వైద్యులు దృష్టిసారించాలని అన్నారు.

చెట్టుకొమ్మలు తొలగింపు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 3 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మెట్టుగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత అమర్ టాకీస్ ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో పర్యటించి చెట్టుకొమ్మలను తొలగించారు. అంతేకాకుండా సాధ్యమైనంత త్వరగా విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులకు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కంటి పరిక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పాఠశాలలో విద్యార్థులందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు.

– బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 3

బౌద్ధనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: బౌద్ధనగర్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు డివిజన్‌లో కలియ తిరుగుతూ సభ్యత్వాలు చేపట్టారు. ఆన్‌లైన్‌లో సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 3: గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం – గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన గుర్తు తెలియని ఓ వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 45-50 సంవత్సరాలు ఉంటాయని, నల్లటి టీ షర్టు, నలుపు, తెలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దారితోనే ఇబ్బందులు

- అవస్థలు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

డిస్పెన్సరీకి వెళ్లే దారి దుస్థితి

అమీర్‌పేట్, సెప్టెంబర్ 3: ఈఎస్ఐ లబ్ధిదారులు వైద్యం చేయించుకోవాలంటే హడలిపోతున్నారు. చక్కటి వైద్యం, మందులు ఉచితంగా అందుతున్నా, వైద్యం అందించే డిస్పెన్సరీలకు వెళ్లే దారుల వారికి నరకాన్ని చూపిస్తున్నాయి. సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు సమీపంలో ఉన్న ఈఎస్ఐ పురాతన క్వార్టర్లలో సనత్‌నగర్ 1, 2 బోరబండ, బాలానగర్ డిస్పెన్సరీలు కొనసాగుతున్నాయి. అయితే తరుచూ డిస్పెన్సరీల భవనాలు మార్చక తప్పని పరిస్థితి. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న నాలుగు డిస్పెన్సరీలను శిథిలమై నిరుపయోగంగా మారిన సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ పురాతన క్వార్టర్లలలోకి మార్చారు. దీంతో సనత్‌నగర్, ఫతేనగర్, బాలానగర్, బోరబండ ప్రాంతాల నుంచి ఈఎస్ఐ కార్డుదారులు వైద్యం కోసం పురాతన భవనాల్లో ఉన్న ఈఎస్ఐసీ ప్రాంగణానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వైద్య కళాశాలకు ఓ క్రీడా మైదనం ఉండి తీరాలన్న నిబంధన మేరకు ఈఎస్ఐసీ యాజమాన్యం తమకు చెందిన ఈఎస్ఐ పురాతన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మించే పనులను వేగవంతం చేసింది. ఈ క్రమంలో ఇక్కడున్న దాదాపు 1200 పురాతన భవనాలను నేలమట్టం చేస్తోంది. దీంతో నాలుగు డిస్పెన్సరీలు కొనసాగుతున్న ఈ ప్రదేశమంతా శిథిలాలతో నిండిపోయింది. దీంతో పాటు పురాతన డ్రైనేజీ లైన్లు, వరద నీటి కాలువలు కూడా ధ్వంసం కావడంతో వర్షాకాలంలో ఈ మార్గంలో నడవడం కూడా కష్టసాధ్యమైంది. ఇక ద్విచక్ర వాహనాలు నడపడం ప్రమాదంతో కూడుకున్నది. దీనికి తోడు గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ మార్గం పూర్తిగా బురదమయమైంది. ఈ నాలుగు డిస్పెన్సరీలు కలిపితే ప్రతి రోజు కనీసం 1300 మంది వరకు రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఇప్పటికైనా ఈ డిస్పెన్సరీలను రోగులకు అనుకూలంగా ఉండే ప్రాంతాలకు తరలించాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు, సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్ తదితరులు ఈఎస్ఐసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే ఉన్నతాధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు తెలిపారు.

శ్రీ జైన్ శ్వేతాంబర్ తెరపంత్ సభ

కంటోన్మెంట్ శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్‌లో మంగళవారం శ్రీ జైన్ శ్వేతాంబర్ తెరపంత్ సభ సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేశ్ హాజరై పర్యూషన్ మహాపర్ సన్నిధి జైన్ సాధ్వి శివ మాలాజీ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీ జైన్ శ్వేతాంబర్ తెరపంత్ సభ అధ్యక్షుడు సుచిల్ సంచితి, ప్రధాన కార్యదర్శి హేమంత్, బాబులాల్ బెయిన్, సురేశ్ సురాన, ప్రకాశ్ బంటియా, విమల్, బాబూలాల్ బెంగనీ, లక్ష్మిపాత్ బైత్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొన్నారు.

– మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 3

ఎంబీపీ వన్‌టైం చాన్స్ పరీక్షా ఫీజు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం తరువాత ఎంబీఏలో చేరినవారు తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సులన్ని సెమిస్టర్ల పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 14వ తేదీ వరకు చెల్లించవచ్చని అన్నారు. ఈ పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చు.

కోదండరాంను విద్యాశాఖ మంత్రిని చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3 : ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన కోదండరాంను రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి, విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. కోదండరాం ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యారంగం బలోపేతమవుతుందని అన్నారు. పలువురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ .. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని నెరవేర్చే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యమాలతోనే తనకు గుర్తింపు వచ్చిందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రొ.సయీదా తలత్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ షెఫర్డ్ బీన వేణి, ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘాల నాయకులు డాక్టర్ ధర్మతేజ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు, చిత్రంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, హరగోపాల్, లింబాద్రి

ఎంఎంఎస్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్) పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంఎస్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని అన్నారు.

ఎంబీపీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) (నాన్ సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) (సీబీసీఎస్) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళల ఉత్పత్తులు

కౌతా కల్యాణ నిలయంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో చీరలు కొనుగోలుచేస్తున్న ప్రజలు

రామంతాపూర్, సెప్టెంబర్ 3 : సికింద్రాబాద్ కౌతా కంచి కామకోటి కల్యాణ నిలయంలో నిర్వహిస్తున్న స్వదే శీ హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన ఎంతో ఆకుట్టుకుంటుంది. అన్ని వయస్సుల వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ఫ్యాషన్ డిజైన్స్ జమ్ము కాశ్మీర్ ఎంబ్రాయిడరీ సారీస్, ధర్మవరం, వెంకటగిరి, గద్వాల్,పోచంపల్లి, కలంకారీ, ఉప్పాడ, అస్సాం, బిహార్, ప్రింటెడ్, అస్సాం, కర్నాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పట్టుచీరలు సరసమై